క్లుప్తంగా

బాధితులకు ఆర్థిక సాయం


చెక్కులు అందజేస్తున్న సంఘం సభ్యులు

కందుకూరు: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయడి చికిత్స పొందుతున్న మండలంలోని మాన్యగూడకు చెందిన ఎగిరిశెట్టి రాజు, ఎగిరి శెట్టి సుదర్శన్‌లకు శాలివాహన వెల్ఫేర్ సంఘం అండగా నిలిచింది. శాలివాహన వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్ నిడిగొండ నరేష్‌కుమార్ సూచనతో వైస్ చైర్మన్ దాసారం రాజు సోమవారం ట్రస్ట్ నుంచి రూ.21 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గం కుమ్మరి సంఘం అధ్యక్షుడు బాలయ్య, ప్రధానకార్యదర్శి వేలాద్రి, మండల అధ్యక్షుడు రవి, ప్రధాన కార్యదర్శి ఎ.జంగయ్య, పద్మమ్మ, నరసింహ, అంజన్న, సాంబయ్య పాల్గొన్నారు.

నూతన క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న చైర్మన్ తదితరులు

కందుకూరు: మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయానికి సంబంధించి 2024 సంవత్సర నూతన క్యాలెండర్‌ను సోమవారం ఆ సంఘం చైర్మన్ డి.చంద్రశేఖర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు శేఖర్‌రెడ్డి, నరసింహ, అంజమ్మ, జగదీశ్వర్‌రెడ్డి, ఎస్.వెంకట్రామ్‌రెడ్డి, పాండురంగారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు నివాళి


మల్లయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కందుకూరు: మండల పరిధిలోని నేదునూరు గ్రామ మాజీ సర్పంచ్ బద్దుల మల్లయ్యయాదవ్ దశదిన కర్మ కార్యక్రమానికి సోమవారం ఆయా పార్టీ నాయకులు హాజరై నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ అఫ్జల్ బేగ్, ప్రభాకర్‌రెడ్డి, నర్సింహ, బాబు, పి.మహిపాల్‌రెడ్డి, హనుమంత్‌నాయక్, బాలకృష్ణ ముదిరాజ్, వెంకట్‌రెడ్డి, వెంకటయ్య, శ్రీధర్‌ముదిరాజ్, నాగేష్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

'ఎక్స్ క్రాస్‌రోడ్' సినిమా పోస్టర్ ఆవిష్కరణ


సినిమా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నేతలు

హుడాకాంప్లెక్స్: కేదార్ శంకర్స్ ఎక్స్ క్రాస్‌రోడ్ సినిమా పోస్టర్ ఆవిష్కరణ సోమవారం కొత్తపేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీలు బొగ్గారపు దయానంద్‌గుప్తా, రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి, డైరెక్టర్ ఎన్.ఎన్.రాజులు హాజరై ఆవిష్కరించి మాట్లాడారు. కేదార్ శంకర్స్ కాంబినేషన్స్‌లో గుడుగుండ్ల మహేష్‌గుప్తా విభిన్నమైన పాత్రలో నటిస్తూ మార్చిలో రిలీజ్ కాబోతున్న సినిమాకు యూనిట్‌కు, చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో యాక్టర్ మాలిక్ బాబు, అప్పాజి అంబరీష్, ప్రసాద్, డీ.డీ. శ్రీనివాస్, కో ప్రొడ్యూసర్స్ నాగేశ్వర్‌రావు, ఇందిర, బీఆర్ఎస్ నాయకులు దయాకర్‌రెడ్డి, ఉపేందర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తిరుప్పావై ఉత్సవాలు


ప్రవచనాలు చెబుతున్న నర్సింహాచార్యులు

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్ పరిధి వెంకటేశ్వరకాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలను పురస్కరించుకుని గత నెల 16 నుంచి జనవరి 14 వరకు తిరుప్పావై ప్రవచనాలు నిర్వహించనున్నారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం 5.30 గంటలకు నర్సింహాచార్యుల వారిచే తిరుమల తిరుపతి దేవస్థానం, ఆల్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు వారి సౌజన్యంతో నిర్వహించే తిరుప్పావై ప్రవచనాలకు హాజరయ్యే భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు తెలిపారు.

దరఖాస్తులు @1,40,898

- పక్కాగా కొనసాగుతున్న ప్రజాపాలన అర్జీల ఆన్‌లైన్ నమోదు
- ఇప్పటి వరకు 25 శాతం పూర్తి
- 230 మంది డాటా ఆపరేటర్లతో వేగంగా కొనసాగుతున్న ప్రక్రియ
- 17వ తేదీ లోపు పూర్తి చేయాలని ఆదేశం


ఆన్‌లైన్ ప్రక్రియను పర్యవేక్షిస్తున్న ప్రత్యేకాధికారి రాజేశ్వర్‌రెడ్డి


ఆన్‌లైన్ చేస్తున్న డాటా ఆపరేటర్లు

మహేశ్వరం: ఆరు గ్యారంటీ పథకాల అమలులో భాగంగా అర్హులను గుర్తించేందుకు ప్రభుత్వం గత నెల 28 నుంచి ఈ నెల 6 వరకు ప్రజాపాలన పేరుతో పల్లెలు, పట్టణాల్లో గ్రామ సభలు, వార్డు సభలు నిర్వహించి పేదల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. మహేశ్వరం నియోజకవర్గంలో వివిధ పథకాలకు 1,40,898 మంది దరఖాస్తులు చేసుకున్నారు. మహేశ్వరం మండలం–15,332, తుక్కుగూడ- 6499, కందుకూరు–18420, జల్‌పల్లి–32,059, బడంగ్‌పేట్–32,446, మీర్‌పేట్–18,594, సరూర్ నగర్, ఆర్‌కేపురం డివిజన్లు–32,059 మంది దరఖాస్తులు చేసుకున్నారు. వచ్చిన దరఖాస్తుల వివరాలను మండలాలు, డివిజన్లు, కార్పొరేషన్లు, మున్సిపాలిటీల వారీగా ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ నియోజకవర్గంలో ఇప్పటికే ప్రారంభమైంది. దరఖాస్తుల ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు ఈ నెల 17లోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ శశాంక్ అధికార యంత్రాంగానికి దిశానిర్దేశం చేశారు. దీంతో నియోజకవర్గంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేసే కంప్యూటర్ డాటా ఆపరేటర్లు, ప్రభుత్వ కళాశాల, ప్రైవేట్ సంస్థలలో పని చేసే కంప్యూటర్ డాటా ఆపరేటర్లతో ప్రజాపాలన దరఖాస్తులను యుద్ధ ప్రాతిపదికన ఆన్‌లైన్ చేస్తున్నారు.

నియోజకవర్గంలో 230 మంది దాటా ఆపరేటర్లు

ప్రజాపాలనలో మహాలక్ష్మి, రైతు భరోసా, గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పథకాల కోసం దరఖాస్తులు స్వీకరించారు. గ్రామసభలు ముగియడంతో అధికారులు దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదుపైన దృష్టి సారించారు. ప్రభుత్వ ఆదేశాలతో దరఖాస్తులను ఆన్‌లైన్ చేసే ప్రణాళిక సిద్ధం చేశారు. ఇందుకు ఆయా సంస్థల్లో పని చేసే సుమారు 230 మంది కంప్యూటర్ ఆపరేటర్లు పని చేస్తున్నారు. ఒక్కో ఆపరేటర్‌కు కొన్ని దరఖాస్తులను ఎంట్రీ చేయాలని నిర్దేశించారు. వారు 27 అంశాలను పథకాల వారీగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. వారి పేరుతో ప్రత్యేకంగా లాగిన్ కేటాయించి ఫోన్ నంబర్‌కు వచ్చే ఓటీపీ సాయంతో డేటా ఎంట్రీ చేసేలా పక్కగా చర్యలు తీసుకుంటున్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత దరఖాస్తుపై ఎర్ర రంగుతో టిక్ చేస్తారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలన్నీ పక్కాగా భద్రపరచాలని జిల్లా కలెక్టర్, కింది స్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ కంప్యూటర్ ఆపరేటర్లకు ఒక దరఖాస్తుకు రూ. 5 చొప్పున, ప్రైవేట్ ఆపరేటర్లకు రూ.15 చొప్పున ప్రభుత్వం చెల్లించనుంది.

నియోజకవర్గంలో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ ,ఆన్‌లైన్ నమోదు, పర్యవేక్షణ కోసం ఒక ప్రత్యేకాధికారిని జిల్లా కలెక్టర్ నియమించారు. అలాగే ప్రతి మండలానికి, కార్పొరేషన్లు, డివిజన్లు, మున్సిపాలిటీలకు ఒక ప్రత్యేకాధికారిని, ప్రతి గ్రామ పంచాయతీ, వార్డుకు ఒక అధికారిని నియమించి పర్యవేక్షణ చేపట్టారు. తహసీల్దార్లు, ఎంపీడీఓలు, కమిషనర్లు, ఆయా శాఖల్లో పని చేసే ఇంజనీరింగ్ అధికారులు, ఉద్యోగులు భాగస్వాములయ్యారు.

17 లోపు దరఖాస్తుల ఆన్‌లైన్ పూర్తి చేస్తాం



నియోజకవర్గంలోని ప్రజాపాలన దరఖాస్తులు1,40,898 వచ్చాయి. వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని లక్ష్యం పెట్టుకున్నాం. ఇప్పటివరకు 25 శాతం దరఖాస్తులను ఆన్‌లైన్ చేశాం. ఎంట్రీల ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. 17లోపు మొత్తం దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తాం.

–రాజేశ్వర్‌రెడ్డి, ప్రజాపాలన ప్రత్యేకాధికారి, మహేశ్వరం

రోడ్డు విస్తరణకు హామీ

- ఈఈని కలిసి సమస్యను విన్నవించిన చైర్మన్

సాక్షి ఎఫెక్ట్..


ఈఈకి వినతి పత్రం అందజేస్తున్న అబ్దుల్లా సాది

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలోని ఎర్రకుంట ప్రధాన రహదారి విస్తరణకు నోచుకోకపోవడంతో తరచూ జరుగుతున్నా ప్రమాదాల విషయమై సాక్షి దిన పత్రికలో సోమవారం 'ఇరుకున పెడుతున్న... ఇరుకు రోడ్డు' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి పాలక మండలి స్పందించింది. మున్సిపాలిటీ చైర్మన్ అబ్దుల్లా సాది కౌన్సిలర్లతో ఆర్ అండ్ బీ నేషనల్ హైవే ఈఈ ధర్మారెడ్డిని మాసబ్‌ట్యాంక్‌లోని కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఎర్రకుంటలో రోడ్డు విస్తరణ చేపట్టకపోవడం... గోతులమయంగా మారిన రహదారికి కనీసం మరమ్మతులు చేయకపోవడంతో తరచూ ప్రమాదాలు జరిగి అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారంటూ ప్రమాదఘటనలతో ప్రచురితమైన సాక్షి కథనాన్ని ఉదహరించారు. గతంలో ఎర్రకుంట మర్రిచెట్టు నుంచి పహాడీషరీఫ్ వరకు విస్తరించిన రహదారి సైతం ప్రస్తుతం పెరిగిన వాహనాలకు సరిపోవడం లేదని వివరించారు. దీంతో రూ.80 కోట్ల వ్యయంతో రహదారిని పూర్తి స్థాయిలో విస్తరించనున్నామని ఈఈ తెలిపారని చైర్మన్ వెల్లడించారు.

మురుగు సమస్యకు పరిష్కారం


పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న కౌన్సిలర్ శంకర్

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ శ్రీరాం కాలనీలో నెలకొన్న మురుగు సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. కాలనీ నుంచి మొదలైన మురుగునీటి ప్రవాహం మధుబన్ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారిపై కూడా పారుతుండడంతో దుర్వాసనతో స్థానిక ప్రజలు, వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యేవారు. ఈ విషయం సాక్షి దినపత్రికలో గత నెల 19న 'మురుగు సమస్య పరిష్కరించండి' అనే శీర్షికతో ప్రచురించడం జరిగింది. ఎట్టకేలకు సమస్యపై మున్సిపాలిటీ అధికారులు స్పందించి రూ.18.50 లక్షలు మంజూరు చేశారు. టెండర్ ప్రక్రియ కూడా పూర్తి కావడంతో పైప్‌లైన్ నిర్మాణ పనులు కౌన్సిలర్ పల్లపు శంకర్ కాలనీవాసులతో కలిసి ప్రారంభించారు. కాలనీలోని ధనలక్ష్మి కిరాణ స్టోర్ నుంచి దిగువన ఉన్న ఎర్రకుంట వరకు 200 మీటర్ల పొడవులో వేస్తున్న ఈ పైప్‌లైన్‌తో ఇక శాశ్వత పరిష్కారం లభించనుందన్నారు.

నిర్విరామంగా ఆన్‌లైన్ ప్రక్రియ


ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న కమిషనర్


కందుకూరు: ఆన్‌లైన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

- మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్

తుక్కుగూడ: ప్రజాపాలన అభయహస్తం దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ నిర్విరామంగా కొనసాగుతుందని మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్ తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ వ్యాప్తగా వచ్చిన 8,355 దరఖాస్తుల్లో ఇప్పటి వరకు 2 వేలకు పైగా ఆన్‌లైన్ చేశామన్నారు. సిబ్బందిని పూర్తిగా ఆన్‌లైన్ విధులకు కేటాయించామన్నారు. కార్యక్రమంలో మేనేజర్ వెంకటేష్, సిబ్బంది ఉన్నారు.

వేగవంతం చేయండి

కందుకూరు: దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని నియోజకవర్గం ప్రత్యేకాధికారి రాజేశ్వర్‌రెడ్డి ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో కొనసాగుతున్న ప్రజాపాలన ఆన్‌లైన్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వీకరించిన దరఖాస్తులను పారదర్శకంతో నమోదు చేయాలన్నారు. ఎలాంటి తప్పులు దొర్లకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ వెంకట్రాములు, తహసీల్దార్ గోపాల్ పాల్గొన్నారు.

కందుకూరులో 18,420 దరఖాస్తులు

కందుకూరు: మండల పరిధిలోని 35 గ్రామ పంచాయతీల్లో మొత్తం 18420 దరఖాస్తులు వచ్చాయి. అగర్‌మియాగూడ 220, ఆకులమైలారం 835, అన్నోజిగూడ 381, బాచుపల్లి 468, బైరాగిగూడ 118, బేగరికంచె 217, బేగంపేట 627, చిప్పలపల్లి 494, దెబ్బడగూడ 863, దాసర్లపల్లి 434, దాసర్లపల్లితండా 163, దావూద్‌గూడతండా 164, ధన్నారం 383, గూడూరు 670, గుమ్మడవెల్లి 722, జబ్బార్‌గూడ 164, జైత్వారం 570, కందుకూరు 1136, కటికపల్లి 168, కొలన్‌గూడ 226, కొత్తగూడ 468, కొత్తూర్ 500, లేమూరు 1064, మాదాపూర్ 448, మీర్‌ఖాన్‌పేట 695, ముచ్చర్ల 902, మురళీనగర్ 333, నేదునూరు 1652, పెద్దమ్మతండా 185, పులిమామిడి 602, రాచులూరు 772, సాయిరెడ్డిగూడ 358, సరస్వతిగూడ 220, సార్లరావులపల్లి 361, తిమ్మాపూర్ నుంచి 837 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ వెంకట్రాములు తెలిపారు.

డ్రోన్‌లతో గుర్రపుడెక్కను తొలగించాలి

- ఎమ్మెల్యే సబితారెడ్డి


మీర్‌పేట: గుర్రపుడెక్కను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

మీర్‌పేట: డ్రోన్ ద్వారా చెరువులోని గుర్రపుడెక్కను తొలగించాలని ఎమ్మెల్యే సబితారెడ్డి అధికారులను ఆదేశించారు. మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని మంత్రాల చెరువును కప్పివేసిన గుర్రపుడెక్కను సోమవారం అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆమె పరిశీలించారు. చెరువులో నీరు తక్కువగా ఉండడం వల్లే గుర్రపుడెక్క తొలగింపు యంత్రం పనిచేయడం లేదని అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. డ్రోన్‌ల ద్వారా పిచికారీ చేయించి వీలైనంత త్వరగా గుర్రపుడెక్కను తొలగించాలని సబితారెడ్డి సూచించారు. ఎమ్మెల్యే వెంట మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కమిషనర్ వాణి, డీఈ గోపీనాథ్, కార్పొరేటర్లు భూపాల్‌రెడ్డి, సిద్దాల లావణ్య, నాయకులు జెటావత్ శ్రీనునాయక్, దిండు భూపేష్‌గౌడ్, సిరూర్ బాల్‌రాజ్‌లు ఉన్నారు.

ప్రజలకు అండగా ఉంటాం


హుడాకాంప్లెక్స్: చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ మండల తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో సోమవారం సరూర్‌నగర్, ఆర్‌కేపురం డివిజన్ పరిధిలో మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను కార్పొరేటర్ ఆకుల శ్రీవాణితో కలిసి లబ్ధిదారులకు ఎమ్మెల్యే సబితారెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ మానవీయ కోణంలో ఆలోచించి వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పెన్షన్లను రూ.2 నుంచి 4 వేలకు పెంచారని, కొత్తగా ఒంటరి మహిళలు, బోధకాలు వ్యాధి వారికి, డయాలసిస్ రోగులకు పెన్షన్లు ఇచ్చారని గుర్తు చేశారు. గతంలో మంజూరు అయినప్పటికీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో చెక్కుల పంపిణీలో ఆలస్యమైందని, వెంటనే చెక్కులను బ్యాంకులలో జమ చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ఇక ముందు లక్ష రూపాయలతో పాటు తులం బంగారం అందుకుంటారని ఆశిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు దయానంద్ గుప్తా, మల్లేశం, నాయకులు అరవింద్ శర్మ, బాలకిషన్, కొండల్‌రెడ్డి, నాగేష్, నర్సింహరెడ్డి పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

తలకొండపల్లి: భక్తితో ముక్తి, మోక్షం లభిస్తుందని జెడ్పీటీసీ వెంకటేశ్ అన్నారు. కల్వకుర్తి మండలం ఎంగంపల్లి గ్రామ శివారులోని పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యాక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. జెడ్పీటీసీ వెంకటేశ్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శిథిలమైన దేవాలయాలను పునరుద్ధరించడంతో పాటు నూతన ఆలయాలను నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ నిర్వహకులు భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో భారత జాగృతి విద్యార్థి విభాగపు జిల్లా అధ్యక్షుడు గణేష్, సర్పంచ్‌లు గోపాల్‌నాయక్, హన్మనాయక్, కిషోర్, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం


పారాయణంలో పాల్గొన్న కాలనీవాసులు, ఆలయ కమిటీ ప్రతినిధులు

మీర్‌పేట: మీర్‌పేట శివసాయినగర్ కాలనీలోని శ్రీ గౌరీ నీల కంఠేశ్వర స్వామి సమేత శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయంలో మార్గశిర శుద్ధ ఏకాదశి సందర్భంగా సోమవారం సనాతన ధర్మ ప్రవర్తక సమితి ఆధ్వర్యంలో శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర ద్వాదశావృత్తి పారాయణం నిర్వహించారు. దీంతో పాటు శ్రీ గాయత్రి సేవా సంఘం మీర్‌పేట వారు శ్రీరామ నామ తారకమంత్రం, హనుమాన్ చాలీసా పారాయణం, భజన పాటలో పాటు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు సంతోష్‌రెడ్డి, వెంకట కృష్ణారావు, వెంకటరమణ, శివరాం ప్రసాద్, శ్రీనివాస ప్రసాద్ సీతారామచంద్ర స్వామి పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

- ఇన్‌చార్జి ఎంపీపీ కె.సునితానాయక్


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సునితానాయక్

మహేశ్వరం: విద్యార్థులకు ఉత్తమ బోధన అందించి మంచి ఫలితాలు తీసుకురావాలని ఇన్‌చార్జి ఎంపీపీ కె.సునితానాయక్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో పీఆర్టీయూ టీఎస్ 2024 క్యాలెండర్‌ను ఆమె నాయకులు, ఉపాధ్యాయులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించి ఉత్తమ ఫలితాలు తీసుకురావాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం ప్రతి ఉపాధ్యాయుడు పని చేయాలన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ టీఎస్ మండల అధ్యక్షుడు వీరమల్లేష్, ప్రధాన కార్యదర్శి జానకిరామ్ ఉపాధ్యాయులు యాదయ్య, ఆనంద్, శివగంగ ఆలయ డైరెక్టర్ చంద్రయ్య, అంధ్యానాయక్ పలువురు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయండి

- డీటీ సంతోష్‌కు బీజేవైఎం నేతల వినతి


డీటీకి వినతిపత్రం ఇస్తున్న అనిల్

తలకొండపల్లి: మండల కేంద్రంలో ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని బీజేవైఎం అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్, ఉప సర్పంచ్ అనిల్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆధార్ సెంటర్ లేకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. స్థానికంగా ఆధార్ కేంద్రం లేకపోవడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను వివరించారు. నూతన ఆధార్ కార్డు తీయాలన్నా, పేరు, అడ్రస్, జన్మదినం తదితర మార్పులు, చేర్పులు చేయాలన్నా ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఆధార్‌లో ఏలాంటి మార్పులు చేయాలన్నా పక్క జిల్లాలైన నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్‌లోని వెల్దండ, కల్వకుర్తి, ఊరుకొండపేట, మిడ్జిల్ తదితర గ్రామాలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని చెప్పారు. ఎన్నో వ్యయ ప్రయాసాలకు ఓర్చి తీరా అక్కడికి వెళ్తే భారీ క్యూలైన్ ఉంటుందన్నారు. దీంతో పని మానుకొని పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఉందని డీటీకి విన్నవించారు. పని కాకుంటే రెండు, మూడు రోజులు తిరుగడమే గాకుండా, పడిగాపులు కాసి నిరీక్షించవలసిన దైన్యస్థితి నెలకొందని తెలిపారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మండల కేంద్రంలో తక్షణమే ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మధు, కుమార్, శేఖర్, ఆనంద్, పరమేష్, వెంటేశ్ తదితరులు పాల్గొన్నారు.

వారంలో ఫిర్యాదుల పరిష్కారం

- మేయర్ గద్వాల విజయలక్ష్మి
- ఎల్‌బీనగర్‌లో 'ప్రజావాణి' పరిశీలన



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న మేయర్ విజయలక్ష్మి

ఎల్‌బీనగర్: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను క్షేత్ర స్థాయిలో పరిక్షించి వారంలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని మేయర్ గద్వాల విజయలక్ష్మి తెలిపారు. సోమవారం ఎల్‌బీనగర్ జోనల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిని ఆమె పరిశీలించడంతో ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. గతంలో కరోనా ప్రబలడం వల్ల ప్రజావాణిని నిలిపి వేశామని చెప్పారు. తిరిగి ఈ రోజు నుంచి జీహెచ్‌ఎంసీ మొత్తం కార్యక్రమం చేపట్టామని తెలిపారు. ఈ నెల 22 నుంచి జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో కూడా ప్రజావాణి ప్రారంభిస్తామన్నారు. ఎల్‌బీనగర్ జోనల్ పరిధిలో మొత్తం 21 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. అందులో అధికంగా టౌన్ ప్లానింగ్‌కు సంబంధించి ఉన్నాయని, ఆ తర్వాత శానిటేషన్, కుక్కల బెడద, వీధి దీపాలు, దోమల నివారణపై ఫిర్యాదులు అందాయన్నారు. ప్రజావాణిలో వచ్చిన సమస్యలను పరిష్కరించడంతో నిర్లక్ష్యం వహిస్తే డీసీలకు మెమోలు జారీ చేస్తానని మేయర్ హెచ్చరించారు. అనంతరం ఎల్‌బీనగర్ జోనల్ పరిధిలోని డీసీలు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జోనల్ కమిషనర్ పంకజ, ఎస్ఈ అశోక్‌రెడ్డి, టౌన్‌ప్లానింగ్ సీపీ ప్రసాద్‌రావు, అధికారులు పున్ననాయక్, రజినీ ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్న మేయర్ విజయలక్ష్మిని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ లచ్చిరెడ్డి, కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ కలిసి డివిజన్లలోని సమస్యలు వివరించారు. ప్రధానంగా కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ, దోమలు, విద్యుత్ వీధి దీపాలు తదితర సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు. మేయర్ ఆయా సమస్యలను విని సానుకూలంగా స్పందించారు.